క్లుప్తంగా

కౌన్సిలర్ సేవలు అభినందనీయం



కౌన్సిలర్ బాల సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలోని రైన్ గేజ్ ఎక్స్‌టెన్షన్ 7వ వార్డు కౌన్సిలర్ బాల సుబ్రహ్మణ్యం అందించిన సేవలు అభినందనీయమని వార్డు ప్రముఖులు ప్రశంసించారు. శనివారం స్థానిక 7 వ వార్డులో కౌన్సిలర్‌కు సన్మాన సభ నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కెంచ వరదయ్య మాట్లాడుతూ.. వార్డులో నెలకొన్న నీరు, చరండీలు, రోడ్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వార్డు అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేష్ మాట్లాడుతూ.. నీటి సమస్య నెలకొన్న పరిస్థితుల్లో నీటి పైపులకు మరమ్మతు చేయించి ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా నీరందించారని గుర్తు చేశారు. తమ వార్డుకు బాల సుబ్రహ్మణ్యం మళ్లీ కౌన్సిలర్‌గా రావాలని ఆకాంక్షించారు. బాల సుబ్రహ్మణ్యం కౌన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సన్మానించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శివారెడ్డి, టైలర్ రసూల్, టిప్పు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త స్టార్టర్ అపహరణ

చిలమత్తూరు: కొడికొండ పంచాయతీ బలిజపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీరామరెడ్డి పొలంలోని రూ.15 వేలు విలువ చేసే బోరు స్టార్టర్ చోరీకి గురైంది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలిచిన తర్వాత కొడికొండ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కక్ష పూరితంగా తన మోటారు స్టార్టర్ టీడీపీ కార్యకర్తలే ఎత్తుకెళ్లి ఉంటారని బాధితుడు అనుమానం వ్యక్తం చేశారు. మనుషులకు రక్షణ లేదని, వ్యవసాయమే జీవనాధారంగా జీవించే తమకు ఇలా స్టార్టర్లు ఎత్తుకెళితే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర్

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని వృద్ధుడు గాయపడ్డాడు. వివరాలు.. కియా పోలీసులు తెలిపిన మేరకు..బెంగళూరు వైపు నుంచి అనంతపురం వెళ్తున్న కారు.. పెనుకొండ 44వ జాతీయ రహదారిపై కోతాస్ కాఫీ షాపు ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనింది. దీంతో వెంకటగిరిపాళ్యానికి చెందిన వడ్డీ గంగాధర్ అనే వృద్ధుడు గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం వృద్ధుడిని పోలీసులు పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు అనంతపురం తరలించారు.

ఎంపీటీసీ బైక్ అపహరణ

చిలమత్తూరు: మండల కేంద్రంలో శుక్రవారం చిలమత్తూరు-3 ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డికి చెందిన ద్విచక్ర వాహనాన్ని దుండగులు అపహరించారు. బాధితుడి వివరాల మేరకు..ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి శుక్రవారం మండల కేంద్రంలోని ఓ పశువుల దాణా కేంద్రం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఉంచి అనంతపురం వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి 10 గంటలకు రాగే వాహనం కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాల చోరీలు ఎక్కువగా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఫిర్యాదులు అందినా వాటి గురించి పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కైవారం తరలిన భక్తులు



కైవరం తాతయ్య భక్తులు తరలువెళ్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం ప్రాంతం నుంచి 300 మంది భక్తులు కైవారం తాతయ్య జీవ సమాధి మహోత్సవానికి శనివారం బయలుదేరారు. కైవారంలో ఆదివారం తాతయ్య 189 వ సమాధి మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా తాతయ్య భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించనున్నారు. కైవారం వెళ్లిన వారిలో సద్గురు యోగి నారాయణ సేవా సమితి గురువులు, పలువురు భక్తులు ఉన్నారు.

కియా ఏఎస్ఐకి ఉద్యోగోన్నతి



నజీర్ అహ్మద్

పెనుకొండ రూరల్: కియా పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న నజీర్ అహ్మద్‌కు ఎస్ఐగా ఉద్యోగోన్నతి లభించింది. కర్నూలు రేంజ్ డీఐజీ నుంచి ఉత్తర్వులు అందినట్లు కియా ఎస్ఐ రంగడు తెలిపారు.



మడకశిర చెరువుకు చేరిన వర్షపు నీరు



రొద్దం పెద్దచెరువులోకి చేరిన వర్షపు నీరు

తెరిపివ్వని వరుణుడు



మడకశిర మండలం జీవీపాళ్యం వద్ద పారుతున్న వంక



రొద్దం మండలం తురకలాపట్నంలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

- నైరుతి రుతుపవనాలతో విస్తారంగా కురుస్తునన వర్షాలు

మడకశిరరూరల్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి విస్తారంగా వర్షం కురిసింది. మడకశిర మండలంలో 40.6, రొళ్లలో 41.4, అగళిలో 32.6, గుడిబండలో 25.4, అమరాపురంలో 6.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెక్‌డ్యామ్‌లు నిండి చెరువులు, కుంటలకు వర్షపు నీరు చేరుతోంది. మడకశిర చెరువుకు నీరు చేరడంతో బోరుబావుల్లో నీటి మట్టం పెరుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తీరనుందని చెబుతున్నారు. ఇక రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాల్లో కంప చెట్లను తొలగించి భూములను పంటల సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. నీటి సౌకర్యం ఉన్న భూముల్లో మొక్కజొన్న, పత్తి తదితర విత్తనాలను విత్తుతున్నారు.

మండలంలో భారీ వర్షం

రొద్దం: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలో పలు చెరువులోకి వర్షపు నీరు భారీగా చేరింది. వాగులు, వంకలు, చెక్ డ్యాంలు పొంగి పొర్లాయి. భారీ వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మేఘం కమ్మెను.. వర్షం కురిసెను

హిందూపురం: హిందూపురం -లేపాక్షి రహదారిపై శనివారం సాయంత్రం లేపాక్షి వైపు నుంచి నల్లటి మేఘాలు వేగంగా దూసుకొస్తున్నట్లుగా కనిపించింది. దుప్పటితో మూసివేసినట్లు ఆకాశమంతా మేఘావృతంగా మారింది. కొద్దిసేపటి గాలులు వీచి పురంలో వర్షం కురిసింది

ప్రధాన రహదారిపైనే వర్షపు నీరు

రొద్దం: మండలంలోని తురకలాపట్నంలో పావగడ-పెనుకొండ ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇళ్ల వద్ద రోడ్డుపై వర్షపునీరు నిలిచి ఉంది. ఎస్సీ కాలనీలో నుంచి రోడ్డుపైకి రావడానికి వీలు లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.



మేఘావృతమైన ఆకాశం

పాడి పరిశ్రమతోనే ఆర్థిక ప్రగతి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: పాడి పరిశ్రమతోనే ఆర్థిక ప్రగతి సాధ్యం. రైతులు పాడి ఆవులను పెంచుకుని పాల విక్రయాలతో అధిక లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే వెంకటేశ్ సూచించారు. శనివారం తాలూకాలోని సీకే పురం గ్రామంలో నూతన పాల సేకరణ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాడి పరిశ్రమకు ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత గ్యారంటీ పథకాలను తుచ తప్పకుండా అందిస్తున్నా ప్రజలు మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించడం శోచనీయమన్నారు. పక్కనున్న ఆంధ్ర రాష్ట్రంలో ఉచితాలను క్రమం తప్పకుండా ప్రతి ఏటా అందిస్తున్నా కూడా వైఎస్ జగన్‌ను 11 స్థానాలకే పరిమితం చేయడం ఆశ్చర్యకరమన్నారు. ప్రజల మనోభావాలను అంచనా వేయడం కష్టమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడు ఆనందరావ్, కేపీసీసీ సభ్యుడు కోటి ప్రభాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ శంకరరెడ్డి, బిందు మాధవ్, పాల ఉత్పత్తి సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

'కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది'

రొళ్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి సుమారు నాలుగు నెలల పాటు కష్టపడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు. ఈనెల 4వ తేదిన వెలువడిన ఎన్నికల ఫలితాల్లో మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కేవలం 315 ఓట్ల తేడాతో పరాజయం పొందడం బాధాకరమైన విషయన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పకు రొళ్ల మండలంలో 1,300 ఓట్లకు పైగా మెజార్టీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించారు. దాడులు మానుకోవాలని టీడీపీ కార్యకర్తలకు హితవు పలికారు. గ్రామ స్థాయి నుంచి మళ్లీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను సమన్వయం చేసుకుని పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

కార్యకర్తలు అధైర్య పడకండి

గుడిబండ: సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ విజయం కోసం అహర్నిశలు కష్టపడినకార్యకర్తలకు పార్టీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు శనివారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప 315 ఓట్ల తేడాతో ఓడిపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతి ఒక్కరికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని.. అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చింతా ఈశ్వరయ్య, చింతా వెంకటలక్ష్మమ్మ జ్ఞాపకార్థం కుమారుడు చింతా శ్రీనివాసులు శిబిరం నిర్వహణకు సహకరించారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు 146 మందికి కంటి పరీక్షలు చేసి 110 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారందరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న కురుబ సంఘం నాయకులు

హిందూపురం టౌన్: కురుబ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కనకదాస కల్యాణమండలంలో కనకదాస ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు పూజారి రెడ్డప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్, జేఈఈ మెయిన్స్, నీట్‌లో ప్రతిభ కనబరిచిన 200 మంది కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, కుటుంబ పరంగా, సంఘం పరంగా ఎంతో అభివృద్ధి చెందుతామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి జనార్దన్, కోశాధికారి శేఖర్, ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ బాలాజీ, ఎస్‌టీఓ జగదీష్, మహేష్ గౌడ్, తాలూకా నాయకులు ఆంజనేయులు, గంగాధరప్ప, రామకృష్ణప్ప, లక్ష్మీనారాయణ, ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టు వద్ద మరమ్మతులు చేపట్టాలి



రొళ్లకొండ ఈశ్వర ఆలయం వద్ద చెత్తను తొలగిస్తున్న అర్చకుడు మోహన్

రొళ్ల: రొళ్ల కొండ గ్రామ సమీపంలోని మడకశిర ప్రధాన 544ఈ జాతీయ రహదారి పక్కన వెలసిన ఈశ్వరుడి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన కల్వర్టులో చెత్తాచెదారం పేరుకుపోయిందని అర్చకుడు మోహన్ తెలిపారు. నీరు బయటికి రాకపోవడంతో పక్కనే ఉన్న సీసీ రోడ్డు గుండా ప్రవహించడంతో పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి పెద్ద ఎత్తున వంక పొంగి పొర్లడంతో కల్వర్టుకు అమర్చిన పైపులు చెత్తా చెదారంతో పూర్తిగా మూసుకుపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వాపోయారు. దీంతో భక్తులు ఆలయానికి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. సంబంధిత అధికారులు జాతీయ రహదారి వద్ద కల్వర్టుకు అమర్చిన పైపులను తొలగించి రాతితో పెద్ద రంధ్రాలు చేస్తే వర్షపు నీరు సులువుగా బయటికి వెళ్లే అవకాశం ఉందన్నారు. వర్షం పడితే అటవీ ప్రాంతం గుండా వచ్చే నీరు ఈశ్వర ఆలయం పక్కనే ఉన్న వంకలో నుంచి రొళ్ల చెరువుకు వెళ్తుందన్నారు.

పేట వేంకటరమణస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో పేట వేంకటరమణుడు

హిందూపురం: పట్టణంలోని ప్రముఖ పేట వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి మూలవిరాట్‌కు బంగారు అభరణాలు, విశేష పుష్పాలతో అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేపట్టారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వెంకట రమణస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో ఉంచి మేళతాళాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మండల పూజ



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పట్టణ ప్రముఖులు

హిందూపురం: శ్రీకంఠాపురంలో నూతనంగా నిర్మించి ప్రతిష్ఠింపజేసిన అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం మండల పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో గణపతి, నవగ్రహ, సుబ్రహ్మణ్య పరివార దేవతా హోమాలు చేపట్టారు. అలాగే అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు గంధ, విభూది, పంచామృభిషేకాలు నిర్వహించారు. తర్వాత స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జేవీ అనిల్ కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు పీడీ పార్థసారథి, వరప్రసాద్, వేణుగోపాల్, తిరుమలేష్, బద్రీ, మునీ, శాంతరాజు తోపాటు గురుస్వాములు లింగప్ప, తిరుమలేశ, నాగరాజు, అశ్వర్థనారాయణ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మవరం రూరల్: మండలంలోని దర్శినమల గ్రామానికి చెందిన పోతులయ్య(44) అనే కూలి ప్రమాదవు శాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలు.. పోతులయ్య రెండు రోజుల క్రితం ధర్మవరంలో పాత ఇంటిని తొలగించడానికి కూలి పనికోసం వెళ్లాడు. అక్కడ ప్రమాదవు శాత్తు ఇంటిపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వైస్ ఎంపీపీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట



వైస్ ఎంపీపీ గంగరాజును పరామర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ నేతలు, కార్యకర్తల ఆగడాలు ఎక్కువయ్యాయని, వారి చేతుల్లో దాడులకు గురైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ బోయ గంగరాజును అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎన్నికల ఫలితాల రోజున దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన అనంతపురం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం ఆసుపత్రికి చేరుకుని గంగరాజు ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అధైర్యపడొద్దు అండగా ఉంటానని భరోసా కల్పించారు. గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహంతో దాడులు చేయడాన్ని ఖండించారు. గంగరాజు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా తనపై దాడి చేయగా చేయి విరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ నేత రెడెప్పరెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, నాయకులు నారాయణ స్వామి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



ఏకపాదంపల్లి సమీపంలో బోల్తా పడిన లారీ

తాడిమర్రి: ఏకపాదంపల్లి సమీపంలో శనివారం లారీ బోల్తా పడిన ఘటనలో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ధర్మవరం నుంచి మట్టిలోడుతో వెళుతున్న లారీ ఏకపాదంపల్లి సమీపంలోని బస్టాప్ వద్ద వెళ్లగానే తాడిపత్రి వైపు నుంచి ధర్మవరం వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. అయితే లారీలోని డ్రైవర్, క్లీనర్ చిన్నపాటి గాయాలతో బయట పడ్డారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరక్కుండా బయట పడటంతో అక్కడ ఉన్నవారు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ఏకపాదంపల్లి బస్టాప్ సమీపంలో రోడ్డుపై గుంతలు పటడం, రోడ్డు మలుపు ఉండటంతో తరచుగా లారీలు, బస్సులు, ఐచర్లు, ద్విచక్ర వాహనాలు బోల్తా పడుతున్నారు. ఈ ప్రమాదాల్లో పలువురు మృత్యువాత సైతం పద్దారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు దృష్టి సారించి రోడ్డు మరమ్మతులు చేసి ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దీపిక

హిందూపురం: హిందూపురం ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి కె.ఉషారాణి ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సూగురు ఆంజనేయ స్వామి ఆలయం కల్యాణ మండపం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు దీపిక, స్వాతి 450 మంది కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 180 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే గత నెలలో ఆపరేషన్లు చేయించుకున్న వారిని తిరిగి పరీక్షలు నిర్వహించి కళ్లజోడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వలంటీర్ రహంతుల్లా, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం



మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

పావగడ: పర్యావరణాన్ని పాడు చేయకుండా రక్షించుకుందామని శ్రీక్షేత్ర ధర్మస్థల సంఘం యోజనాధికారి మహేశ్ పిలుపునిచ్చారు. శనివారం తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీక్షేత్ర ధర్మ స్థల సంఘం, సుందర్ లాల్ బహుగుణ ఇకో క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లను విరివిగా పెంచాలని సూచించారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు రేణుకారాజ్ మాట్లాడుతూ.. ప్రతి జీవి ప్రకృతికి అనుగుణంగా నడచుకుని పర్యావరణాన్ని కాపాడుకుంటూ జీవిస్తున్నాయన్నారు. అయితే మానవుడు మాత్రం తన ఉనికి కోసం అడవులను నరికి పర్యావరణాన్ని పాడు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు నాగరాజు, పీడీఓ సంతోష్ సింగ్, ఉపాధ్యాయులు విమల, హనుమేశ్, కుమార్, రశ్మి తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గాయపడిన జింక మృతి



జింకను పరిశీలిస్తున్న అధికారులు

గోరంట్ల: మండలంలోని పులేరు సమీపంలో శనివారం కుక్కల దాడిలో జింక గాయపడింది. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. బీట్ ఆఫీసర్ రాహుల్‌తో పాటు సిబ్బంది అక్కడికి చేరుకొని గాయపడిన జింకను గోరంట్ల పశువైద్యశాలకు తరలించారు. గాయపడిన జింకకు స్థానిక పశువైద్యులు చికిత్స చేస్తుండగా, కొంత సేపటికే మృతి చెందింది.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఇద్దరు ఎంపిక



భానుతేజ



అభిలాష్

పరిగి: మండలంలోని మోదా జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం ఉమాదేవి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిభావంత విద్యార్థులను ప్రోత్సహించడానికి 8వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన ట్యాలెంట్ టెస్టులో పాఠశాలకు చెందిన భానుతేజ 110, అభిలాష్ 108 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరికి నాలుగేళ్ల పాటు ప్రతి విద్యా సంవత్సరం రూ.12 వేలు అందుతుందన్నారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు రామారెడ్డి, రాజశేఖర్‌ను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726